క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

భైంసాటౌన్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సలహాలు, సూచనల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 99592 26005 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: ఈనెల 20న శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సుల సమయపాలన, అదనపు ట్రిప్పుల గురించి సమస్యలు ఉంటే ఫోన్ నెంబర్ 99592 26003లో సంప్రదించాలని సూచించారు.

పుస్తె, మెట్టెలు అందజేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో బొప్పారపు తార-వెంకటేశ్ గతంలో మృతి చెందగా వారి కూతురుకు వివాహం నిశ్చయమైంది. పేదకుటుంబం కావడంతో ఖానాపూర్‌వాసి ఒడ్డెపల్లి కృష్ణంరాజు సహకారంతో ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు.. గురువారం యువతి ఇంటికి వెళ్లి పుస్తె, మెట్టెలు అందజేశారు. తల్లిదండ్రులు లేని పేదింటి యువతి వివాహానికి చేయూతనిచ్చిన కృష్ణంరాజును గ్రామస్తులు అభినందించారు.

మాజీ మంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్ యజమాని శివాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అల్లోల తిరుపతిరెడ్డి, మహేశ్ రెడ్డి, నాలం శ్రీనివాస్, శ్రీధర్, రమేశ్, అనుముల భాస్కర్ తదితరులు ఉన్నారు.

పన్నులు చెల్లించాలి

కుంటాల: సకాలంలో ఇంటి పన్ను, నీటి బిల్లులు చెల్లించాలని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పేర్కొన్నారు. గురువారం కుంటాలలో పన్నుల వసూళ్లను పరిశీలించారు. పన్నులు చెల్లించడం ద్వారా పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. వారి వెంట కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి గురువారం అడిదెల రాజన్న, సట్ల శంకర్ గురుస్వాముల సన్నిధానం సభ్యులు రూ.12వేలను విరాళంగా అందించారు. సమష్టి సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నామని కమిటీ సభ్యులు తెలి పారు. విరాళం అందించిన వారిలో స్వాములు శ్రీనివాస్, భూవర్ధన్, సుతన్, రాజు, ప్రకాశ్, గులాబ్‌సింగ్, కొండయ్య, చిన్నయ్య, అశోక్, నాగరాజు ఉన్నారు.

వైద్యశిబిరం

మామడ: మండలంలోని రాశిమెట్ల ఆశ్రమోన్నత పాఠశాలలో 128 మంది విద్యార్థులకు గురువారం సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలను వైద్య సిబ్బంది వివరించారు. ఇందులో పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ నరేందర్, హెల్త్ అసిస్టెంట్లు రమణారెడ్డి, రవి, ఏఎన్ఎం భాగ్యరేఖ, ల్యాబ్ టెక్నీషియన్ విజయలక్ష్మి ఉన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులు ఆరోగ్యకర పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు సత్తయ్య అన్నారు. మండలంలోని సత్తనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు స్పందన, వర్షగౌడ్, అనితకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం సుదర్శన్ ఆధ్వర్యంలో పోటీల్లో రాణించిన విద్యార్థులు లావణ్య, శ్రీనిత్య, శ్రావణిలకు బహుమతులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు వాల్గొట్ శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

బంగారు ఉంగరం అప్పగింత

బాసర: మండలకేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు పోగొట్టుకున్న తన విలువైన బంగారు ఉంగరాన్ని తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు బాసరకు చెందిన జంగం రాజేందర్. గురువారం ఆలయ ప్రాంగణంలో హైదరాబాద్‌కు చెందిన వీరేందర్ అనే భక్తుడు తన ఉంగరాన్ని పోగొట్టుకున్నాడు. అక్కడే అభిషేకసేవలో ఉన్న రాజేందర్‌కు ఉంగరం దొరకడంతో ఆలయ సిబ్బంది గంగా సింగ్‌కు అందించి తన నిజాయతీ చాటుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది వీరేందర్‌కు బంగారు ఉంగరాన్ని అప్పగించారు. నిజాయతీతో అందించినందుకు రాజేందర్‌ను భక్తులు, వీరేందర్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

జాతరకు వేళాయె..

- రేపు శ్రీ భ్రమరాంభిక, మల్లికార్జున స్వామి కల్యాణం
- 21న దేవుడి చెరువు జాతర
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



స్వామివారి విగ్రహాలు



నర్సాపూర్(జి)లోని శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం

నర్సాపూర్(జి): మండలకేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీప్రాంతంలో కొలువుదీరింది శ్రీ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయం. చుట్టూ పచ్చని చెట్లు.. ప్రకృతి ఒడిలో చెరువు సమీపంలో ఉన్న ఈ ఆలయం భక్తుల కొంగుబంగారంగా పేరుగాంచింది. కోరిన కోరికలు నెరవేరుతాయని వివిధ ప్రాంతాల భక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఏటా మార్గశిర మాసంలో..

ఏటా మార్గశిర మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే తొలి శనివారం ఆది దంపతులైన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామికి కల్యాణం, ఆదివారం జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఈ ఆలయాన్ని 1974లో శ్రీ శంకరాచార్యుల శిష్యులు శ్రీ విద్యారణ్య, శ్రీకృష్ణానంద స్వాములు ఏర్పాటు చేశారు. రేణుకమాత, ఆంజనేయస్వామి ఆలయాలను 2017లో నర్సాపూర్ (జి)కి చెందిన జీవీ అనిల్‌రెడ్డి తన తండ్రి నర్సారెడ్డి జ్ఞాపకార్థం పునఃనిర్మించారు.

రేపు స్వామివారి కల్యాణం

శనివారం ఉదయం స్వస్తి పుణ్యాహవచనం, మూల విరాట్ అభిషేకం, స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయానికి తీసుకెళ్తారు. అనంతరం పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించి అన్నదానం చేస్తారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివస్తారు.

ఆదివారం జాతర..

జాతర సందర్భంగా ఉదయం శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామివారికి పూలు, పత్రి, పసుపు (బండారి)తో అభిషేకం నిర్వహిస్తారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వడ్లను బియ్యంగా మార్చి చేసిన పాయసాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వనభోజనాలు చేసి ఉల్లాసంగా గడుపుతారు.

తరలిరానున్న ప్రజలు..

జాతరకు చుట్టుపక్క గ్రామాలతో పాటు కుంటాల, లోకేశ్వరం, దిలావర్‌పూర్ మండలాల నుంచి వేలాదిగా తరలివస్తారు. ఈనేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జాతరలో స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు సేవలు అందిస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

దేవుడి జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్, ఇతర వసతుల ఏర్పాట్లను గురువారం సీఐ.. ఎస్సై సాయికిరణ్, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

నేటి నుంచి జాతర

- బోరిగాంలో హనుమాన్ ఉత్సవాలు
- మల్లయోధులకు కుస్తీ పోటీలు



బోరిగాంలో ముస్తాబైన హనుమాన్ ఆలయం

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామంలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలో మహాలక్ష్మి, పోచమ్మ ఆలయంలో బోనాలను నైవేద్యంగా సమర్పిస్తారు. శనివారం ఉదయం హనుమాన్ ఆలయంలో అభిషేకం, పూజల అనంతరం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏళ్లుగా ఉత్సవాలు..

2008లో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన శర్మ మహారాజ్ గ్రామస్తుల సహకారంతో బోరిగాంలో నూతన హనుమాన్ ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ఏటా ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లాతోపాటు, మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు.

కుస్తీ పోటీలు..

జాతర సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ప్రథమ బహుమతి రూ.10,001, వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.7501, వెండి కడియం, తృతీయ బహుమతిగా రూ.5,001 అందిచనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

‘పార్టీ బలోపేతానికి కృషి చేయాలి’



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్

నిర్మల్‌చైన్‌గేట్: కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్మల్‌లో నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. భారత్ కమ్యూనిస్ట్ పార్టీ దేశంలోనే మొదటి రాజకీయ పార్టీ అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం, సమసమాజ స్థాపన, హక్కుల కోసం పోరాడాలని పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు 4,000 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించారని అన్నారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో సీపీఐ శత ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎస్ఎన్ రెడ్డి, భూక్య రమేశ్‌నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలని నిరసన



భైంసాలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు



లోకేశ్వరంలో భగత్ సింగ్ చౌరస్తాలో..

భైంసాటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ చిత్రపటాలతో నిరసన తెలిపారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్ రావు పటేల్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, దళిత సంఘాల నాయకులు గిరిధర్, రాహుల్ దగ్డే, భీంరావు డోంగ్రే, ప్రసంజిత్ హిమ్మే, సాయిలు, గంగాధర్, సాహెబ్‌రావు ఉన్నారు.

తానూరు: తానూరులోని అంబేద్కర్ చౌక్‌వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండలాధ్యక్షుడు అంబాదాస్ పవార్ మాట్లాడారు. భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు సురేకాంత్ పవార్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు భీమ్‌పవార్, భీమ్ ఆర్మీ నాయకులు అవినాశ్, మాణిక్ పవార్, చంద్రకాంత్, సంజయ్, మిలింద్ ఉన్నారు.

కడెం: అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని అన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు మోడం శంకర్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, దండే రమేశ్, సాయన్న, గంగన్న, చందు, కైలాస్, ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షఫీ ఉన్నారు.

ముథోల్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను గురువారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ సభ్యులు, అఖిలపక్షం ఆధ్వర్యంలో దహనం చేశారు. వారు మాట్లాడుతూ అమిత్‌షా క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ.. తక్షణం అమిత్‌షాను తన కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ సభ్యులు, అఖిలపక్ష నాయకులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్: నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానను వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో మందుల నిల్వలు, వాటి గడువు వివరాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంగన్వాడీ సిబ్బంది కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, సీడీపీవో సరిత, నాయకులు షౌకత్ పాషా, తదితరులు ఉన్నారు.

‘బీజేపీ నేతలు నిజాలు తెలుసుకోవాలి’

భైంసాటౌన్: బీజేపీ నాయకులు.. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తున్నారని గతంలో ఆయన చేసిన అభివృద్ధి తెలుసుకుని మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు విఠల్‌రెడ్డి చేసిన అభివృద్ధి బీజేపీ నేతలకు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, డైరెక్టర్ తోట రాము, భూమన్న, రాజేశ్వర్, కిషన్, నాయకులు సూర్యనారాయణ, సాయినాథ్, అవినాష్, మేదరి సంఘం నాయకులు గంగాధర్, శ్రీనివాస్, గణేశ్, లక్ష్మణ్, కపిల్ ఉన్నారు.

రాష్ట్రస్థాయికి భైంసా ఫుట్‌బాల్ జట్టు



భైంసా ఫుట్‌బాల్ జట్టు

భైంసాటౌన్: జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో భైంసా ఫుట్‌బాల్ జట్టు సత్తా చాటింది. ఖానాపూర్ జట్టుతో జరిగిన పోరులో విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు పాల్గొననుంది. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భైంసా జట్టును పలువురు అభినందించారు.

వరల్డ్ విజన్ సేవలు అభినందనీయం



బాబాపూర్‌లో మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న తహసీల్దార్ జానకి

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 మరుగుదొడ్లను రూ.90 వేలతో ఆధునీకరించిన వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. మూత్రశాలలు సరిగా లేకపోవడంతో ఇక్కడున్న 142 మంది విద్యార్థులు ఇబ్బంది పడేవారు. సంస్థ ఆధునీకరించిన మరుగుదొడ్లను గురువారం తహసీల్దార్ జానకి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ ఇండియా మేనేజర్ బ్రహ్మన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కరుణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ధర్మేందర్, అంగన్‌వాడీ టీచర్ ఉజ్వల, గ్రామపంచాయతీ కమిటీ అధ్యక్షుడు మాడబోయిన రమేశ్, గ్రామ అభివృద్ధి అధ్యక్షుడు గుండాల బాబన్న, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ



కిట్లను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: పట్టణంలోని అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శబరిమల యాత్రికుల కోసం తయారు చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏఎస్పీ అవి నాష్‌కుమార్ తన కార్యాలయంలో పలువురికి గురువారం పంపిణీ చేశారు. శబరిమలకు వెళ్లే యాత్రికులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా ప్ర యాణం చేయాలని సూచించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కిట్లను ఉచితంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ నైలు, సేవాసమితి అధ్యక్షుడు మోహన్, గురుస్వాములు శివాజీ, భూమేష్, సాయిబాబా, సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి శిక్షణ

తానూరు: మండలంలోని గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను తనిఖీ చేసేందుకు పాటించాల్సిన విధివిధానాలపై గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తనిఖీ బృందానికి గురువారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సార్పీ పాండురంగ్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి తనిఖీ బృందం సభ్యులు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పనుల వివరాలను పరిశీలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఆయా గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

వీడియోగ్రాఫర్ల కార్యవర్గం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో గురువారం ఉమ్మడి మండల దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఎన్నికలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆయిట్ల ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్టమని శ్రీనివాస్, కృష్ణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సగ్గం వంశీ, కెమెరా క్లబ్ అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉమ్మడి మండల గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెన లక్ష్మీపతి, అధ్యక్షుడిగా దూసముడి నవీన్, ఉపాధ్యక్షుడిగా కీని వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కద్దల సాయందర్, కోశాధికారిగా గంగుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మేడాజీ నరేశ్, ప్రచార కార్యదర్శిగా గాడి నరేశ్, ముఖ్య సలహాదారులుగా బొద్దుల అశోక్, కొత్తకొండ శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని జిల్లా కార్యవర్గ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

నాయకుల ముందస్తు అరెస్ట్

ఖానాపూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి స్థానిక నాయకులను గురువారం ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో దాసరి రాజన్న, నేతశ్యాం, ద్యావతి రాజేశ్వర్, మ్యాదరి రాజేశ్వర్, దాసరి రాజేశ్వర్, శ్రీహరి ఉన్నారు.

కడెం: హైదరాబాద్ మాల మహానాడు కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని కన్నాపూర్, పెద్దబెల్లాల్ తదితర గ్రామాల మాల సంఘ నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టులతో సంఘం పోరాటాలను ఆపలేరని నాయకులు దాసండ్ల నారాయణ, తుమ్మల శ్రీహరి, ముద్దం ప్రశాంత్ అన్నారు.

పాఠశాలల పనివేళలు మార్చాలి

కడెం: జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పాఠశాలల పనివేళలను మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా కలెక్టర్ పాఠశాలల పనివేళలను ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జొన్న పంటలు పరిశీలన

ముథోల్: మండలకేంద్రంలో జొన్న పంటలను గురువారం ముథోల్ ఏరువాక శాస్త్రవేత్తలు పరిశీలించారు. అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు పాటించాల్సిన సలహాలు అందజేశారు.

పంటల సర్వేపై సమాచారమివ్వాలి

భైంసాటౌన్: పంటల సాగు వివరాలు నమోదు చేసే వ్యవసాయాధికారులు తమకు సమాచారమివ్వాలని పలువురు రైతులు కోరారు. గురువారం మున్నూరు కాపు సంఘ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఈఓకు వినతిపత్రం అందించారు. వ్యవసాయాధికారులు సర్వేపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో పంటల వివరాలను నమోదు చేసుకోలేక పోతున్నామని అన్నారు. దీంతో పంట దిగుబడులు విక్రయించే సందర్భంలో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, సలహా సభ్యుడు పోశెట్టి, ఉపాధ్యక్షుడు గాలి రాజన్న, హన్మాండ్లు, రాజు, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ముథోల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల గంగారెడ్డి అన్నారు. గురువారం ముథోల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పాటిల్ ఆధ్వర్యంలో ముథోల్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద రూ.38లక్షలు, నియోజకవర్గంలో సీసీరోడ్లు, డ్రెయినేజీల కోసం రూ.4 కోట్ల నిధులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పతంగే, అజీజ్, పల్లోళ్ల నాగేష్, సోషల్ మీడియా కన్వీనర్ నజీమ్, మండల యూత్ అధ్యక్షుడు దుడ్డు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం మండలానికి రూ.1.10 కోట్లు మంజూరు

లోకేశ్వరం: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులకు రూ.1.10కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన నిధుల ప్రొసీడింగ్‌ను గురువారం భైంసాలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షఫీ, సుధీర్ రెడ్డి, ముత్యంరెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఇర్ఫాన్ షేక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జుమ్మేరత్ పేట్ హైస్కూల్‌లో ఇర్ఫాన్‌షేక్‌ను ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను సంఘ రాష్ట్ర బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. సంఘ ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం ఇప్పటికే పలు సమస్యలను పరిష్కరించిందన్నారు. ఇందులో పాఠశాల హెచ్ఎం రవిబాబు, ఉపాధ్యాయులు దత్తురామ్, వసంతరావు, మల్లేశం, మనోహర్, సుదర్శన్, ఘమరుల్లా, గంగాధర్, దయానంద్, వినోద్, రమణ, శ్రీమంత్, మంజుల, హేమలత పాల్గొన్నారు.

‘రైతుల పేరిట స్వార్థ రాజకీయాలు’



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

కడెం: బీఆర్ఎస్ నేతలు రైతుల పేరిట స్వార్థ రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. గురువారం కడెంలో మాట్లాడారు. గత వరదలకు ప్రాజెక్టులు దెబ్బ తిన్నా.. బీ ఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరు చేయలేదన్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.9.26 కోట్లతో కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించారని పేర్కొన్నారు. భూషణ్, పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకట శ్రీనివాస్, రమేశ్, బబ్లూ, బొడ్డు గంగన్న, రఫీక్, రహీం, రాజేశ్వర్‌రెడ్డి, షరిపొద్దీన్ రాజన్న తదితరులున్నారు.